## 61

# సిలువ మరణమునకు దారితీసిన హేతువులు

## (26:1-16)

బహుశా, 21:23–25:46లో పేర్కొనబడిన సంఘటనలన్నీ క్రీస్తు శ్రమల వారంలోని మంగళవారం నాడు సంభవించి యుండును. ఆయనతో ఘర్షణపడిన తన విమర్శకులకు యేసు తగిన సమాధానములిచ్చుచు సమాజమందిరములో బోధించాడు (21:23–22:46). పరిసయ్యుల వేషధారణ గూర్చి ప్రజాసమూహములను హెచ్చరించాడు (23:1–39). దేవాలయములో నుండి వెలుపలకు వచ్చిన తరువాత, ఆయన తన అపొస్తలులతో కూడ ఒలీవల కొండకు వెళ్లాడు. ఈ ఏకాంత ఏర్పాటులో, ఆయన వారికి యెరూషలేము నాశనము మరియు ఆకాశ మేఘారూఢుడై ఆయన తిరిగి వచ్చుట గూర్చి బోధించాడు (24:1–25:46). ఒలీవల కొండ మీద ముగిసిన సుదీర్ఘ ప్రసంగము యేసు బహిరంగముగా చేయుచుండిన బోధలకు ముగింపు పలికింది. ఒక్కటి మినహాయిస్తే,[1] 26వ అధ్యాయంలో పేర్కొనబడిన సంఘటనలు క్రీస్తు శ్రమల వారంలోని బుధవారం, బేస్తవారం, మరియు శుక్రవారం నాడు సంభవించాయని స్పష్టమగుచున్నది. యేసును చంపవలెనని యూదుల నాయకులు పన్నిన పన్నాగము బహుశా బుధవారం నాడు జరిగియుండును (26:1–5), ఇస్కరియోతు యూదా వారికి యేసును అప్పగించు ఒప్పందము కూడ వారతనితో అదే సమయంలో కుదుర్చుకొని యుందురు (26:14–16).

ఈ అధ్యాయంతో, మనము యేసు క్రీస్తు యొక్క మరణము, ఆయన పాతిపెట్టబడుట, మరియు ఆయన పునరుత్థానము నొందుట మొదలగు వివరములుగల మత్తయి వ్రాసిన సువార్తలోని చిట్టచివరి భాగములోనికి ప్రవేశించుచున్నాము (26–28 అధ్యాయములు). ఈ సంఘటనల చేత సువార్త వివరము దాని పతాకస్థాయి చేరుచున్నది; యేసు "తన ప్రజలను వారి పాపముల నుండి ఎలా రక్షించునో" ఇది చెప్పుచున్నది (1:21). యేసు సిలువపై మరణించుట దేవుని సార్వభౌమ చిత్తము ప్రకారమే జరిగినది, అది కూడ, సరైన సమయంలో, యేసు సిలువ మరణము నొందుటకు తనను తాను తగ్గించుకొని అప్పగించుకొన్నాడు, సిలువను ఆయన లోక పాపముల ప్రాయశ్చిత్తము కొరకు తనను తాను అర్పించుకొను ఒక బలిపీఠముగా మార్చాడని గ్రంథ పాఠము ఉద్ఘాటించుచున్నది (26:2, 18, 54, 56). దేవుని నిత్య సంకల్పము ప్రకారము, ఈ కథనము, కథాముగింపు యేసు యొక్క విజయోత్సవమైన పునరుత్థాన దశకు చేరక మునుపే, అది విషాదాంతమైనది కాదు లేక ఒక ఓటమి కాదు కానీ నెరవేర్పు మరియు ఒక విజయమై యున్నది.[2]

### #1: యేసును సంహరించుటకు చేయబడిన కుట్ర (26:1–5)

**[1]యేసు ఈ మాటలన్నియు చెప్పి చాలించిన తరువాత జరిగినదేమనగా ఆయన తన శిష్యులను చూచి [2]రెండు దినములైన పిమ్మటపస్కాపండుగ వచ్చుననియు, అప్పుడు**

**మనుష్యకుమారుడు సిలువవేయబడుటకై అప్పగింపబడుననియు మీకు తెలియునని చెప్పెను.**
**[3]ఆ సమయమున ప్రధానయాజకులును ప్రజల పెద్దలును కయప అను ప్రధానయాజకుని**
**మందిరములోనికి కూడివచ్చి [4]యేసును మాయోపాయముచేత పట్టుకొని, చంపవలెనని**
**యేకమై ఆలోచన చేసిరి. [5]అయితే ప్రజలలో అల్లరి కలుగకుండునట్లు–పండుగలో వద్దని**
**చెప్పుకొనిరి.**

**వచనము 1. యేసు ఈ మాటలు అన్నియు చెప్పి చాలించిన తరువాత** – యేసు చేయుచుండిన ఉపదేశమొకటి ముగియగానే అది ముగింపబడినదను సూచనను మత్తయి ఈ విధమైన మాటల ద్వారా వ్యక్తము చేయుచున్నాడు (7:28; 11:1; 13:53; 19:1). ఈ సందర్భములో, శాస్త్రుల మరియు పరిసయ్యుల బహిరంగ నిరాకరణ (23వ అధ్యాయము) మరియు ఒలీవల కొండ మీద ప్రసంగము (24, 25 అధ్యాయములు) యేసు ఉపదేశము యొక్క సమూహముగా కలుపబడినవి. **అన్నియు** అను విశేషణము బహుశా 23, మరియు 25వ అధ్యాయములో వ్రాయబడినట్లు యేసు ఉపదేశించిన విషయములన్నిటిని సూచింపవచ్చును. యేసు తన ఉపదేశ పరిచర్యను ముగించాడను గ్రహింపును కూడ అది కలిగించవచ్చును.

**వచనము 2.** ఆయన చేయుచుండిన ఉపదేశములు ముగియుటతో, యేసు – ఇది నాలుగవసారి (చివరిది కూడ) – ఆసన్నమగుచుండిన ఆయన మరణ వార్తను తన అపొస్తలులకు తెలియజెప్పాడు (16:21; 17:22, 23; 20:17–19 చూడు). **రెండు దినములైన పిమ్మట** నిర్వహించుకొనబడనై యుండిన, **పస్కా** భోజన రాత్రి వేళలో, ఆయన **సిలువవేయబడుటకై అప్పగింపబడును**. ఆయనను సంహరించునట్లు యూదుల నాయకులు పన్నాగము పన్నుచుండిరని యేసు ఎరిగియుండెను, గనుక ఆయన తన తండ్రి యొక్క విమోచనా ప్రణాళికను నెరవేర్చవలసిన సమయము వచ్చిందని ఆయన గ్రహించాడు (26:18).

**వచనము 3.** యేసు ఆసన్నమగుచుండిన ఆయన మరణ వార్తను తన శిష్యులకు తెలియజెప్పుచుండగా, వారు వీలైనంత వరకు అతి తక్కువ గందరగోళముతో ఆయనను పట్టుకొనవలెనని యూదుల నాయకులు ప్రణాళిక వేసుకొనుచుండిరి. **కయప** యొక్క రాజభవనములో జరుగుచుండిన వారి కూడిక బహుశా, దాని చుట్టూర రాజభవనమునకు సంబంధించిన ఇతర భవనములు నిర్మింపబడి యుండిన బహిరంగ **ప్రాంగణములో** (*aulē*) జరుగుచుండవచ్చును. ఏది ఏమైనా, కొన్ని పర్యాయములు *aulē*, రాజభవనము యొక్క పొడిగింపును సూచించుటకే ప్రయోగింపబడినది.[3] పరిశుద్ధ బైబిల్ యొక్క ఆంగ్ల అనువాదములలో అధిక శాతం రెండవ దృక్పథమునకు సానుకూలంగా ఉన్నవి.

ఈ కూడిక క్రమరహితమైన కూడికయై యుండినది, యూదుల మహా సభయైన సన్హెడ్రిన్ యొక్క అధికారిక కూటము కాదు. కూడుకొని యుండిన వారి జాబితాలో **ప్రధాన యాజకులు మరియు ప్రజలపెద్దలు** పేర్కొనబడి యున్నారు, కానీ మూడవ గుంపు, ఈ కూట మిలో భాగమై యుండిన శాస్త్రులు, పేర్కొనబడలేదు (16:21పై గల వ్యాఖ్యానము చూడు). శాస్త్రులు మరియు పరిసయ్యులు హాజరుకాకుండుట యేసు "ఉన్నత వంశమువారైన యూదుల వ్యవస్థ చేత, రాజకీయ వాస్తవికతలలోను రోమా సామ్రాజ్య సమ్రాట్టులైనవారితో

కూడ చేయిచేయి కలపాలను ఆసక్తి కలిగియుండినవారి చేత అత్యంత బలముగా వ్యతిరేకింపబడినాడని సూచించుచున్నదని" లియోన్ మోర్రిస్ గుర్తించాడు.[4]

ప్రధాన యాజకుని పదవి మౌలికంగా అహరోను వంశములో అందరి కంటె పెద్దవాడైన పురుషునికి ఇవ్వబడినది, కానీ క్రీస్తు కాలము నాటికి ఈ పదవి యాజకులలో అత్యధిక వేలం సొమ్ము చెల్లించినవారికి దక్కినది.[5] క్రీ.పూ. 37 మొదలుకొని క్రీ.శ. 67 వరకు ఈ పదవిని కనీసము 28 మంది అలంకరించారు.[6] అన్న, సిరియా దేశమునకు అధిపతియై యుండిన కురేనియస్ చేత నియామకము చేయబడి,[7] క్రీ.శ. 6–15 వరకు అదే పదవిలో ఉన్నాడు. అయితే వలేరియస్ గ్రేటస్ చేత, పొంతి పిలాతు కంటె ముందు ప్రభుత్వ ప్రతినిధిగా ఉండినవాని చేత పదవీచ్యుతుడు గావింపబడ్డాడు. అన్న యొక్క ఐదుగురు కుమారులు కూడ తొలి శతాబ్దములోని ఆ యా సమయాల్లో ఈ పదవిని అలంకరించారు: ఎలీయేజరు, యోనాతాను, థియోఫిలస్, మత్తీయ మరియు అనారస్. అనానస్, తన సుదీర్ఘ జీవితకాలమందంతటను న్యాయమైన ప్రధాన యాజకుడని యూదుల చేత గౌరవింపబడినాడు.[8]

కయప, అన్న యొక్క అల్లుడుగారు (యోహాను 18:13), క్రీ.శ. 18లో వలేరియాస్ గ్రేటస్ చేత ప్రధాన యాజకుడుగా నియమితుడయ్యాడు. ఆతడు ఈ పదవిలో క్రీ.శ. 36 వరకు కొనసాగి, పొంతి పిలాతు తరువాత రాజ్యమేలిన విటెల్లియస్ చేత పదవీభ్రష్టుడయ్యాడు.[9] అతని పరిపాలన అంతకు మునుపెన్నడును లేనంత దీర్ఘ కాలము కొనసాగినది. కయప, రోమా ప్రభుత్వమువారి చేత అధికారపూర్వక ప్రధాన యాజకుడుగా గుర్తింపబడియుండగా, అన్న యొక్క అధికారము యింకను యూదీయ ప్రజల చేత సవిస్తరముగా గౌరవింపబడినది (లూకా 3:2; అపొస్తలుల కార్యములు 4:6).

1990లో, భవన నిర్మాణ పనులు చేయుచుండినవారు యెరూషలేములో అనేక అస్థికుంభములుండిన (ఎముకల పెట్టెలు) ఒక ప్రాచీన సమాధి గుహను బయటికి తీసారు. అన్నిటి కంటె అతి పెద్దదై యుండిన అస్థికుంభముపై చెక్కబడియుండిన స్మారక చిహ్నము మీద, "కయప కుమారుడైన యోసేపు" అని వ్రాయబడి యుండినది. అందులో ఆరుగురు వెర్వేరు వ్యక్తుల ఎముకలుండినవి, వారిలో ఒకడు దాదాపు అరవై యేళ్ల ప్రాయములో మరణించి యుండెను. జోసీఫస్, ప్రధాన యాజకుడైన "జోసీఫస్ కయప" అని ప్రస్తావింపబడుచుండెను[10] గనుక అస్థికుంభము మరియు దానిలో ఉండిన అస్థికలు అతనివే అయియుండునని కొందరు అనుకొనుచుండిరి.[11]

**వచనము 4.** వారు కయప ఉండిన రాజభవనములో కూడుకొనియుండగా, ప్రధాన యాజకులు మరియు పెద్దలు **యేసును మాయోపాయము చేత పట్టుకొని, చంపవలెనని యేకమై ఆలోచన చేసిరి.** యేసును చంపవలెనను తీర్మానము ఈ సమయంలో మొట్టమొదటిసారిగా తీసికొనబడలేదు; అది చాలా కాలం క్రితమే తీర్మానింపబడినది (12:14; 21:38, 45, 46; యోహాను 5:18; 7:1, 19, 25; 8:37, 40; 11:53). యేసును ఎలా పట్టుకోవాలి, ఎలా చంపాలి మొదలగు పథకముల గూర్చి వారు ముందుగానే తీర్మానించుకొన్నారు. "మాయోపాయము" (*dolos*) అను పదము తరుచుగా "వంచన" లేక "టక్కరితనము" అని అర్థమిచ్చును. ఇదే పదమును "నేర్పరితనముతో" అని NIV అనువదించుచుండగా, "చమత్కారముతో" అని NKJV అనువదించుచున్నది. ఏలానైతేనేమి,

చివరకు ఆయన సొంత అపొస్తలులలో ఒకడైయుండినవాడు, ఇస్కరియోతు యూదా యొక్క విద్రోహపూరిత అప్పగింపు వలన యేసు పట్టబడినాడు (26:14-16, 47-56).

**వచనము 5.** ప్రజలలో ఏ మాత్రం **అల్లరి** జరిగినా వారు యేసును బహిరంగముగా పట్టుకొనజాలరని యూదుల నాయకులైనవారు స్పష్టంగా ఎరిగియుండిరి, కాబట్టే వారు ఆ పని రహస్యముగా చేయదలచారు. "పండుగలో వద్దు" అను పదజాలము, "పస్కా పండుగను జరిపించుకొనుటకు వచ్చిన జనసమూహము ముందర వద్దు" అని అర్థమిచ్చుచున్నది[12] (లూకా 22:6 చూడు). ఎంతైనా, యూదా ప్రజల నాయకులు యేసును పట్టుకొనుటకు పస్కా పండుగ ముగియునంత వరకు వేచియున్నట్లయితే, మొదటికే మోసం జరిగి యుండేది, వారు యేసును పట్టుకొను తరుణము వారికి దక్కేది కాదు; ఆయన వారి చేతికి చిక్కక, తిరిగి గలిలయకు వచ్చును.

పస్కా పండుగ సమయంలో యూదులు వారి మనస్సుల్లో ఉరకలెత్తుచుండిన జాతీయవాద ఆకాంక్షలు మరియు మెస్సీయా సంబంధిత ఎదురుచూపులతో యెరూషలేములో కూడుకొనుచుండిరి. మోషే కాలములో ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశ దాసత్వములో నుండి విడుదల చేయబడిన విషయమునకు ఈ పండుగ జ్ఞాపకార్థమైనదై యుండెను. మొదటి శతాబ్దములో, అనేక మంది యూదులు వారిని రోమా ప్రభుత్వ అణచివేత మరియు ఏలుబడి నుండి విడిపించు మెస్సీయ కొరకు ఎదురుచూచుచుండిరి. వారి జాతీయ స్వాతంత్ర్యమును తిరిగి సంపాదించుకొని దావీదు వంటి రాజు వారిని ఏలుచుండవలెనని కాంక్షించుచుండిరి. యేసు వారిని విజయ పథంలో నడిపించవలెనని ఈ యూదులలో కొందరు ఆశించుచుండిరి, ఇది యేసు విజయోత్సవముతో యెరూషలేము లోనికి ప్రవేశించుచుండిన సమయంలో వారు వేసిన కేకల ద్వారా విదితముగా తెలియుచున్నది (21:9పై గల వ్యాఖ్యానము చూడు). కాబట్టి, ఎలాగైనా సరే, యేసును పట్టుకొనదలచిన ఈ పండుగ సమయంలో ప్రజల్లో అల్లరి చెలరేగకూడదని వారు సకల ప్రయత్నము చేయుచుండిరి.

## #2: యేసు అభిషేకింపబడుట (26:6-13)

**6-7 యేసు బేతనియలో కుష్ఠరోగియైన సీమోను ఇంట నున్నప్పుడు, ఒక స్త్రీ మిక్కిలి విలువగల అత్తరుబుడ్డి తీసికొని ఆయనయొద్దకు వచ్చి, ఆయన భోజనమునకు కూర్చుండగా దానిని ఆయన తలమీద పోసెను. 8 శిష్యులు చూచి కోపపడి–ఈ నష్ట మెందుకు? 9 దీనినిగొప్ప వెలకు అమ్మి బీదల కియ్యవచ్చునే అనిరి. 10 యేసు ఆ సంగతి తెలిసికొని–ఈ స్త్రీ నా విషయమై యొక మంచి కార్యము చేసెను; ఈమెను మీరేల తొందరపెట్టుచున్నారు? 11 బీదలెల్లప్పుడు మీతోకూడ ఉన్నారు. గాని నేనెల్లప్పుడు మీతో కూడ ఉండను. 12 ఈమె యీ అత్తరు నా శరీరము మీద పోసి నా భూస్థాపన నిమిత్తము దీనిని చేసెను. 13 సర్వలోకమందు ఈ సువార్త ఎక్కడ ప్రకటింపబడునో, అక్కడ ఈమె చేసినదియు ఈమె జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను.**

**వచనము 6.** మత్తయి వ్రాసిన సువార్త యేసు ఇహమందు గడిపిన దినముల వృత్తాంతమును ఎల్లప్పుడు కాలక్రమానుగతముగా రచించలేదు. ఇచ్చట మత్తయి కొంచెము వెనుదిరిగి అంతకు మునుపు కొద్ది దినముల క్రితం సంభవించిన సంఘటనలను

వివరించుచున్నాడు. **యేసు బేతనియకు** చేరుకొన్నాడు (21:17పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన "పస్కా పండుగకు ఆరు దినములు" ముందుగా వచ్చాడు, గనుక "అక్కడ వారు ఆయనకు విందు చేసారు" (యోహాను 12:1, 2; 26:2 చూడు). ఈ విందు శనివారం సాయంకాలము ఏర్పాటు చేయబడినట్లు అగుపించుచున్నది (యూదుల లెక్కల ప్రకారం అది అప్పటికే ఆదివారం) గనుక అది ఆయన యెరూషలేము లోనికి మరునాడు జయోత్సవముతో ప్రవేశింపక మునుపటి దినమై యుండినది (21:1పై గల వ్యాఖ్యానము చూడు).

ఈ విందుకు కనీసము పదిహేడు మంది హాజరయ్యారు. యేసు, తన పన్నెండు మంది అపొస్తలులతో అచ్చట ఉండెను, లాజరు మరియు అతని సోదరీమణులు, మరియ మరియు మార్త. **సీమోను,** అతిథేయి, **కుష్ఠరోగి యని సంబోధింపబడినవాడు,** అచ్చట ఉండెను. ఈ సీమోనును యేసు అతని కుష్ఠ రోగము నుండి స్వస్థపరచి యుండును. లేదంటే, కుష్ఠరోగుల గూర్చి ధర్మశాస్త్రము ఆజ్ఞాపించుచుండినట్లు, అతడు సమాజానికి ఎంతో దూరంగా నివసించుచుండెడివాడే (లేవియకాండము 13:45, 46). గనుక అతడు స్వస్థత నొందినందుకు సంతోషిస్తూ, అతని కృతజ్ఞతకు సూచకంగా ఈ విందును అతడు ఏర్పాటు చేసియుండవచ్చును. ఇతడు యేసు యొక్క ముగ్గురు స్నేహితుల తండ్రియై యుండెనని ఊహించుకొనబడుచుండినది[13] మరియు లాజరును తిరిగి జీవింపజేసినందునుబట్టి కూడ అతడు తన ప్రగాఢ కృతజ్ఞతను తెలుపుకొనుచుండెను.

**వచనము 7.** మత్తయి మరియు మార్కు ఈ స్త్రీ ఎవరో చెప్పుటలేదు, కానీ ఆమె మరియ, లాజరు సహోదరి అని యోహాను 12:3 తెలియజెప్పుచున్నది. మరియ **మిక్కిలి విలువగల అత్తరుబుడ్డి తీసికొని** యేసును సమీపించినది. ఈ "అత్తరుబుడ్డి" (*alabastros*) పొడుగాటి సన్నని మెడ కలిగియుండు కుప్పె (ఫ్లాస్క్) వంటి సీసా అయియుండును (NKJV). ఇది నునుపైన, నాజూకైన రాతితో చేయబడి, "సుమారు అర లీటరు అచ్చ జటమాంసి అత్తరు"తో (యోహాను 12:3; NIV), భారత దేశంలోని సుగంధపు బంక చెట్ల వేళ్ల నుండి సారముగా తీయబడిన నూనెతో నింపబడినది.[14] "ఈ అత్తరు మున్నూరు దేనారముల కంటె ఎక్కువ వెలకు అమ్మబడవచ్చునని" మార్కు 14:5 చెప్పుచున్నది. ఈ మొత్తము డబ్బు, ఒకని సంవత్సర వేతనమునకు సమానమై యుండవచ్చును (18:28; 20:2; 22:19పై గల వ్యాఖ్యానము చూడు).

ఆ బుడ్డిని పగులగొట్టిన తరువాత (మార్కు 14:3), **ఆయన భోజనమునకు కూర్చుండగా** [మరియ] **దానిని ఆయన తల మీద పోసెను.** "పోయుట" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*katacheō*) అక్షరాలా, "క్రిందికి దిగజారునట్లు కుమ్మరించుట" యని అర్థము. మరియ అచ్చుజటామాంసి అత్తరుతో యేసు తలను అంటి, ఆయన పాదములకు పూసి యుండును, ఏలయనగా ఆమె "యేసు పాదములకు పూసి తన తలవెంట్రుకలతో ఆయన పాదములు తుడిచెను" అనియు, "ఇల్లు ఆ అత్తరు వాసనతో నిండెను" అనియు యోహాను సువార్తికుడు నివేదించుచున్నాడు (యోహాను 12:3). అతిథులు నూనెతో అభిషేకింపబడుట యూదుల విందులలో సామాన్యమైన సంగతై యుండినది (కీర్తనలు 23:5; లూకా 7:46).

ఈ కథ లూకా 7:36–50లో గల కథతో తికమకపడకూడదు, ఆ కథలో ఒక పేరు చెప్పబడని పాపపు స్త్రీ ఆయన పాదముల యొద్ద నిలువబడి, యేడ్చుచు కన్నీళ్లతో

యేసు పాదములను తడిపి, తన తల వెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దుపెట్టుకొని, ఆ అత్తరు వాటికి పూసెనని గ్రంథస్థం చేయబడి యున్నది. ఈ అభిషేకము బేతనియలో మరియ చేసిన అభిషేకమునకు చాలా కాలం క్రితమే జరిగినది. లూకా సువార్తలో వ్రాయబడియున్న సంఘటన గలిలయలో సీమోను, ఒక పరిసయ్యుడు, ఇంట జరిగినది (లూకా 7:36). "సీమోను" అను పేరు ఆ యుగములో ఒక సామాన్యమైన నామధేయమై యుండినది. లేఖనములలో ఈ పేరు గల వారు కనీసము పదిమందైనా ఉన్నారు, యింకా యిరువది మంది సీమోనులు జోసీఫస్ చేత పేర్కొనబడ్డారు.[15] ఈ సందర్భములో, ఒక పాపపు స్త్రీ ఆయనను ముట్టుకొనునట్లు అనుమతించినందుకు యేసు విమర్శింపబడ్డాడు (లూకా 7:39).

ప్రస్తుతము మనము అధ్యయనము చేయుచున్న గ్రంథపాఠములో, ఆమె మితిమీరి వ్యయము చేసినదని మరియు విమర్శింపబడినది (26:8, 9). "నీ పాపములు క్షమింపబడి యున్నవి." … "నీ విశ్వాసము నిన్ను రక్షించెను; సమాధానము గలదానవై వెళ్లుమని" లూకా సువార్తలోని పాపపు స్త్రీతో చెప్పబడినది (లూకా 7:48–50). ఇచ్చటి సందర్భములో యేసు మరియను పొగిడాడు మరియు ఆమెను విమర్శించుచుండిన వారిని గద్దించాడు (26:10–13).

**వచనములు 8, 9.** మరియ యేసు పాదములను అభిషేకించినప్పుడు, **శిష్యులు కోపపడిరి**; వారి దృష్టిలో అది మితిమీరిన **నష్టమై** యుండినది. "అయితే కొందరు కోపపడి – ఈ అత్తరు ఈలాగు నష్టపరచనేల?" అని సణుగుకొనిరి (మార్కు 14:4). అపొస్తలులలో అనేకులు ఇదే విధంగా విమర్శించి యుండవచ్చును, కానీ ఈ పురికొల్పుటను మొదలు పెట్టినది ఇస్కరియోతు యూదా అయియుండును (యోహాను 12:4). "యీ అత్తరెందుకు మూడు వందల దేనారములకు అమ్మి బీదలకు ఇయ్యలేదని" అతడన్నాడు (యోహాను 12:5).[16] ఏది ఏమైనా, "వాడీలాగు చెప్పినది బీదల మీద శ్రద్ధ కలిగి కాదు, గాని వాడు దొంగయై యుండి, తన దగ్గర డబ్బు సంచి యుండినందున అందులో వేయబడినది దొంగలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను" (యోహాను 12:6).

యేసు ప్రభువు మరియు ఆయన అపొస్తలులందరికి యూదా కోశాధికారియై యుండెను, గనుక వాడు కూర్చబడుచుండిన ఆ కొద్ది వనరుల (డబ్బు) నుండి దొంగిలించుచు వచ్చెను. యూదా పేరాసగలవాడై యుండెననియు, సొంత మేళ్లనే అధికం చేసికొనుటకు ఏపనైనా చేయుటకు వెనుకంజవేయడనియు ఇది రుజువు చేయుచున్నది. దొంగతనము చేయువాడు, అబద్ధాలు కూడ చెప్పగలడు మరియు ఇతర పాపములు సహితము చేయగలడు, తన స్నేహితునైనా అప్పగించగలడు.

**వచనము 10.** ఈ సమయంలో, **యేసు** అపొస్తలుల విమర్శను **తెలిసికొన్నాడు** (12:15; 16:7, 8; 22:18 చూడు). ఆయన ఈ విషయాన్ని లోకాతీతమైన రీతిలో తెలిసికొని యుండును లేదా వారి సంభాషణను వినుట ద్వారా తెలిసికొని యుండును (మార్కు 14:4, 5 చూడు).

యేసు మరియ చేపట్టిన చర్య గూర్చి ప్రతివాదించుచు ఆమెను విమర్శించుచుండినవారిని గద్దించుచు, **ఈ స్త్రీ నా విషయమై యొక మంచి కార్యము చేసెను; ఈమెను మీరేల తొందరపెట్టుచున్నారు?** అని పలికాడు. "మంచి" (*kalos*) అని అర్థమిచ్చునట్లు

అనువదింపబడిన గ్రీకు పదము "బాహ్యమునుకు అందమైనది" అను అర్థమును కూడ ఇచ్చును (RSV; NIV; NCV; JNT చూడు), కానీ ఇచ్చట దీనికి "మంచి" లేక "ఘనమైన" అను నైతిక సహజార్థముండుటకు ఎక్కువ అవకాశములున్నవి.

**వచనము 11.** మీరు సహాయము చేయుటకు **బీదలెల్లప్పుడు మీతో కూడ ఉన్నారు** అంటూ యేసు ఆయన మాటలు వినుచుండిన శ్రోతలకు గుర్తుచేసాడు. ఆయన మనస్సులో ద్వితీయోపదేశకాండము 15:11 ఉండియుండవచ్చును: "బీదలు దేశములో ఉండకమానరు; అందుచేత, నేను నీ దేశములో నున్న నీ సహోదరులగు దీనులకును బీదలకును అవశ్యకముగా నీ చెయ్యి చాపవలెనని నీకాజ్ఞాపించుచున్నాను." అట్లయినప్పటికిని, యేసు వారి మధ్య ఎక్కువ సేపు ఉండలేదు. "మరియ యేసు యెడల చేపట్టిన అనురాగసహితమైన చర్య, ఆయన ఇహము నుండి పరమునకు వెళ్లిపోయిన తరువాత కొనసాగవలసి యున్న భక్తిపూర్వకమైన చర్యలను మించిన అగ్రస్థానమును వహించినది (మార్కు 2:19, 20 పోల్చుము)."[17] వారు బీదల యెడల కలిగియుండిన చింతనుబట్టి యేసు అపొస్తలులను విమర్శించలేదు. యేసు అనుచరులందరి వలెనే, వారు కూడ బీదల గూర్చి చింతించుచుండవలెను.

**వచనము 12. ఈమె ఈ అత్తరు నా శరీరము మీద పోసి, నా భూస్థాపన నిమిత్తము దీనిని చేసెను** అంటూ యేసు తన మాటలు కొనసాగించాడు. మృత దేహమును పాతిపెట్టు సమయములో దానికి అత్తరు మరియు సుగంధ ద్రవ్యములు పూసి, దానిని నారబట్టలతో చుట్టుట్ట యూదులలో అదొక వాడుకయై యుండినది. యేసు మరణించిన పిదప, ఆయన దేహమునకు అరిమతయియ వాడైన యోసేపు మరియు నీకొదేము తీసికొని వచ్చిన సుగంధ ద్రవ్యములు పూయబడిన తరువాత అది నారబట్టలతో చుట్టబడినది (యోహాను 19:40). ఆదివారము నాడు వేకువ జామున యేసు సమాధి యొద్దకు వచ్చిన స్త్రీలు యింకా ఎక్కువ సుగంధ ద్రవ్యములు వారితో కూడ తీసికొని వచ్చారు – యేసు దేహమును యింకా ఎక్కువ సముచితమైన రీతిలో పాతిపెట్టబడునట్లు సిద్ధము చేయుట కొరకని అగుపించుచున్నది (మార్కు 16:1). ఈ సందర్భములో, యేసు మరణించక మునుపే మరియ తన శాయశక్తులా చేసినదని చెప్పుకొనవచ్చును.

యేసు మరణించనై యున్నాడని మరియ నమ్మినదా? ఆయన అనేక పర్యాయములు తన మరణము గూర్చి ముందుగానే తెలియజెప్పాడు, కానీ శిష్యులు ఈ వాస్తవమును అంత త్వరగా అర్థంచేసికొనలేదు, వారు కొంచెము మందమతులయ్యారు. ఈ సమయంలో యేసు మరణము గూర్చిన ఆధ్యాత్మిక పరిజ్ఞానము శిష్యుల కంటె ఆమెకే ఎక్కువ ఉండియుండును.[18] యేసు మరియ ఎరిగియుండిన దానినిబట్టికాదు, కానీ తన సొంత ఎరుకనుబట్టియే ఆమె చేసిన అనురాగసహిత చర్యకు అర్థం చెప్పాడనునది మరొక సాధ్యతయై యున్నది. ఆమె యొక "మంచి కార్యము" చేసినదని చెప్పుచు యేసు మరియ పక్షమున వాదించాడు. యూదా మత బోధకులు (రబ్బీలు) రెండు మంచి క్రియలు ప్రాముఖ్యమైనవని పరిగణించారు: బీదలకు సహాయమును సమకూర్చుట మరియు మృతులైనవారు సకల మర్యాదలతో పాతిపెట్టబడునట్లు వారి దేహములను సిద్ధము చేయుట. మృతులైన వారి దేహములు సకల మర్యాదలతో పాతిపెట్టబడునట్లు సిద్ధము చేయుట ప్రథమ ప్రాధాన్యతయై యుండినది ఏలయనగా "దానధర్మముల వలె, అది ఏ సమయంలోనైనా చేయడానికి వీలు కానిదై యుండెను కానీ అవసరమైనప్పుడు మాత్రమే చేయబడదగినదై యుండినది,

అంతమాత్రమేగాక అందులో ఏదో నామమాత్రంగా వ్యక్తిగతముకాని బహుమానముగా డబ్బు ఇవ్వడం కాదు కానీ వ్యక్తిగతముగా చేయబడు ఉపచారము దాగియున్నది."[19]

**వచనము 13.** మరియ తన యొద్ద ఉండిన అత్తరును దాచిపెట్టి అటుతరువాత అవసరమైనప్పుడు ప్రియమైనవారి ఎవరి దేహమునకైనా పూయుటకు అవకాశములుండినవి. ఏది ఏమైనా, ఆమె ఆ తరుణం కొరకు వేచియుండియుంటే, ఈ సువార్ణావకాశము చెయ్యిజారిపోయేదే. ఆమె కృపాళుసహితమైన ఈ కార్యము చేసినందునుబట్టియే, **సర్వలోకమందు ఈ సువార్త ఎక్కడ ప్రకటింపబడునో, అక్కడ ఈమె చేసినదియు ఈమె జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని** యేసు సెలవిచ్చాడు.

### #3: యేసును అప్పగించుటకు యూదా చేసికొనిన ఒప్పందము (26:14–16)

**[14]అప్పుడు పండ్రెండుమందిలో నొకడగు ఇస్కరియోతు యూదా, ప్రధానయాజకులయొద్దకు వెళ్లి [15]–నేనాయనను మీకప్పగించినయెడల నాకేమి ఇత్తురని వారినడిగెను. అందుకు వారు ముప్పది వెండి నాణెములు తూచి వానికి ఇచ్చిరి. [16]వాడప్పటినుండి ఆయనను అప్పగించుటకు తగిన సమయము కనిపెట్టుచుండెను.**

**వచనము 14.** యేసును అత్తరుతో అభిషేకించిన స్త్రీ (మరియ) యొక్క ప్రేమపూర్వకమైన భక్తి ప్రదర్శింపబడిన కార్యము తరువాత ఒక అపొస్తలుని చేత, **పండ్రెడుమందిలో నొకడగువాని చేత** అప్పగింపబడిన కార్యము జరిగినది. ఇచ్చటి ఈ సందర్భము మత్తయి వ్రాసిన సువార్తలో **ఇస్కరియోతు యూదా** పేరు పేర్కొనబడుట ఇది రెండవసారి. మొదటిసారి అతని పేరు 10:4లో వ్రాయబడి యున్నది, అది యేసు తన అపొస్తలులను పిలుచుకొన్న సందర్భమై యున్నది. ఆ వచనములో, అతడు "ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా" అని పేర్కొనబడి యున్నాడు (26:24, 25, 46, 48; 27:3 చూడు). ఒకడు ఈ విధంగా జ్ఞాపకము చేసికొనుబడుట ఎంత ఘోరమైన సంగతి కదా!

మరియ చేసిన అనురాగసహితమైన కార్యము ఇస్కరియోతు యూదా **ప్రధాన యాజకుల** యొద్దకు వెళ్లి వారిని కలుసుకొనునట్లు అతనిని త్వరపెట్టి యుండును. వాని అత్యాశ మూలమున (యోహాను 12:6), యూదా కోపగించుకొన్నాడు; గనుక తన కోపముకొద్ది, యేసు అధికారపూర్వకంగా చేసిన మందలింపును ఇతడు తాళలేకపోయాడు (26:10–13). అతడు మరియను విమర్శించినప్పుడు అప్పటికే యూదా *already* యేసును "అప్పగించుటకు ఉద్దేశించాడని" యోహాను 12:4 సూచించుచున్నది.[20] ఒక రాజ్యమును (ఐహిక రాజ్యము గాక ఆధ్యాత్మిక రాజ్యమును) స్థాపించుట గూర్చి యేసు మనస్సులో ఉండిన భావమునుబట్టియు, రోమా ప్రభుత్వమునకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేయుటలో యేసు నాయకత్వము వహించునట్లు చేయవలెనని వానికుండిన కోరిక నెరవేరకపోవుటనుబట్టియు అతడు నిరాశచెందుట వలన ఇస్కరియోతు యూదా యేసును అప్పగించుటకు ప్రేరేపించిన ఇతర హేతువులై యుండును.

**వచనము 15.** ఈ సన్నివేశము "నిరుత్సాహపరచు వ్యాపార ప్రతిపాదన" యని ముద్రవేయబడినది.[21] వాడు ప్రధాన యాజకుల యొద్దకు వెళ్లి, యేసును వారికి **అప్పగించిన యెడల** వారు వానికి **ఏమి ఇత్తురో** యని వారినడిగాడను వాస్తవము ద్వారా యూదా

కలిగియుండిన పేరాస బహిరంగముగా కనబడుచునే యున్నది. యూదుల నాయకులు యేసును పట్టుకొని ఆయనను చంపుటకు వెదకుచుండిరి గనుక (26:3–5), ఆయన సొంత మనుష్యులలో నుండే ఆయనను వారికి అప్పగించుటకు ఒకడు ముందుకు వచ్చినందుకు, వారు ఎంతగా "సంతోషించియుందురో" మనము ఊహించుకొనగలము (మార్కు 14:11; లూకా 22:5).

ఇస్కరియోతు యూదా అడిగిన దానికి ప్రతిస్పందనగా, వారు అతనికి **ముప్పది వెండి నాణెములు** తూచి ఇచ్చారు. ధర్మశాస్త్రము చొప్పున, ఇస్కరియోతు యూదాకు ఇవ్వబడిన మొత్తము, ఒకని యెద్దు మరొకని దాసుని పొడిచి చంపిన యెడల ఆ దాసుని విషయంలో చెల్లింపబడవలసిన వెలయై యుండినది (నిర్గమకాండము 21:32). ఇది ప్రవక్తయైన జెకర్యా ద్వారా కూడ ముందుగానే ప్రవచింపబడిన వెలయై యున్నది (జెకర్యా 11:12, 13). ఈ దృష్టాంతములోని గొఱ్ఱెలకాపరికి ముప్పది తులముల వెండి తూచి ఇవ్వబడినది, అయితే మత్తయి వ్రాసిన సువార్తలోని యేసు (గొఱ్ఱెలకు మంచి కాపరియైనవాడు) ఇదే వెలకు అమ్మబడుచున్నాడు.[22] ఈ రెండు సందర్భములలోను, గొఱ్ఱెల కాపరి తన ప్రజల చేత తృణీకరింపబడుచున్నాడు. జెకర్యా, యేసును అప్పగించుటకు చెల్లింపబడిన మొత్తమును పేర్కొనుట మాత్రమే కాదు కానీ, ఆ మొత్తము ఒక కుమ్మరివాని పొలము కొనుటకు ఉపయోగింపబడునని కూడ చెప్పాడు. ఈ ప్రవచనము నెరవేరిన వివరమును మత్తయి అటుతరువాత రచించుచు, కళంకితమైన ఈ సొమ్ముతో కొనుగోలు చేయబడిన కుమ్మరివాని పొలము పరదేశులను పాతిపెట్టుటకు సానుకూలమైన స్థలమయ్యిందని తెలియజెప్పాడు (27:6–10).

**తూచి** అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*histēmi* నుండి) జెకర్యా 11:12లో (LXX) కూడ వాడబడినది. జెకర్యా ప్రవక్త క్రీ.పూ. ఆరవ శతాబ్దములో తన ప్రవచనమును గ్రంథస్థం చేసినప్పుడు, వాటి వెల గూర్చి హామి ఇచ్చు విలువగల ముద్రింపబడిన నాణెములు చెలామణిలో లేవు, కాబట్టి వారు ఏర్పాటు చేయబడిన తూనిక కొలమానము ప్రకారము వెండి నాణెములు తూచి ఇవ్వవలసి వచ్చినది.[23] మొదటి శతాబ్దములో నాణెములు మామూలుగా లెక్కింపబడుచుండినప్పటికిని, మత్తయి సువార్తికుడు *histēmi* అను పదమును జెకర్యా ప్రవక్త రచించిన దానిని ప్రతిధ్వనించుటకు ప్రయోగించియుండును. "తూచి" అని అర్థమిచ్చు పదమునకు బదులుగా, అనేక ఆంగ్ల అనువాదములలో "లెక్కించి ఇచ్చిరి" (TEV; NIV; NKJV) లేక "చెల్లించిరి" (NRSV; NJB; CEV) అని అర్థమిచ్చు పదములు ప్రయోగింపబడినవి.

**వచనము 16.** ఈ క్షణము మొదలుకొని, యూదా తానిచ్చిన మాట ప్రకారము తన శత్రువులకు **యేసును** అప్పగించునట్లు **తగిన సమయము** కొరకు వెదకుచుండెను. ప్రధాన యాజకులు మరియు ఇస్కరియోతు యూదా కలుసుకొనిన కూటమి క్రీస్తు శ్రమల వారములోని బుధవారం నాడు జరిగియుండునని స్పష్టమగుచున్నది. ఒకటిన్నర రోజులు గడిచిన తరువాత తాననుకొన్న తరుణం వాని కైవశమయ్యింది.

## "ఆమె జ్ఞాపకార్థము" (26:6-13)

ఒంటరిగా చేయబడిన ఒక చర్య మరొకరి జీవితముపై ఎంతో గొప్ప ప్రభావమును ప్రదర్శింపగలదని యేసు బేతనియలో అత్తరు చేత అభిషేకింపబడిన కథ మనకు బోధించుచున్నది. యేసును అత్తరుతో అభిషేకించిన స్త్రీ పేరు మత్తయి వ్రాసిన సువార్తలో పేర్కొనబడలేదు, కానీ ఆమె మరియ, లాజరు సహోదరి యని యోహాను గుర్తించుచున్నాడు (యోహాను 12:2, 3). మరియ చేసిన మన్ననపూర్వకమైన కార్యములో మనము ఐదు విషయములను గమనించవచ్చును.

1. *ఆమె యేసుకు మిక్కిలి విలువగల బహుమతినిచ్చినది.* ఆమె తీసికొని వచ్చిన అత్తరు వెల సుమారు మున్నూరు దేనారములు, ఈ మొత్తము ఒకని ఒక సంవత్సరపు వేతనము (మార్కు 14:5). ఇంతటి విలువైన బహుమానము నిజముగా ఒక గొప్ప త్యాగమే.

2. *ఆమె తన కొరకు ఏమియు దాచుకొనలేదు.* ఆ బుడ్డీలోని అత్తరు ఒక్క చుక్క కూడా మిగులకుండా అంతయు–"అచ్చజటామాంసి అత్తరు ఒక సేరున్నర యెత్తు" (మార్కు 14:3) – యేసు తల మీద కుమ్మరింపబడునట్లు ఆమె ఆ అత్తరుబుడ్డిని పగులగొట్టినది (యోహాను 12:3; NIV).

3. *ఆమె తన బహుమానమును స్వయంగా తానే యిచ్చినది.* మరియ తన బహుమానమును మరొకరి ద్వారా పంపించుటకు బదులుగా, ఆమె తానే వచ్చి యేసు తలపై ఆ అత్తరును పోసినది. అది సంపూర్తిగా వ్యక్తిగతముగా చేయబడిన చర్యయై యుండినది.

4. *ఆమె ఇతరుల విమర్శను భరించినది.* మరియ చర్యకు మద్దతు పలుకవలసిన శిష్యులే ఆమె చేసిన కార్యమును "నష్టము" అని పిలిచారు. వారు పలికిన హృదయకాఠిన్యమైన మాటలు ఆమె హృదయమును తీవ్రముగా గాయపర్చియుండును.

5. *ఆమె యేసు చేత పొగడబడినది.* యేసు మరియను విమర్శించుచుండిన వారి నోళ్లు మూయించాడు మరియ ఆమె చేసిన చర్య తన భూస్థాపన నిమిత్తమైనదని కూడ సెలవిచ్చాడు. అంతమాత్రమేగాక, "సర్వలోకమందు ఈ సువార్త ఎక్కడ ప్రకటింపబడునో, అక్కడ ఈమె చేసినదియు ఈమె జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని" ఆయన చెప్పాడు (26:13).

మనము చేసిన మన్ననతో కూడిన మంచి కార్యములకు మనము జ్ఞాపకముచేసికొనుబడుదామా?

డేవిడ్ స్టూవర్ట్

## ఇస్కరియోతు యూదా
## (26:14-16, 20-25, 47-50)

ఇస్కరియోతు యూదా పేరు అప్రతిష్ఠాకరమైన నామమై యున్నది. ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన విద్రోహుల గూర్చి మాటలాడుకొనబడునప్పుడెల్లా, ఇతని పేరు జ్ఞాపకము చేసికొనబడుచున్నది మరియు అసహ్యించుకొనబడుచున్నది. ఏ తల్లి, తండ్రి కూడ తమ కుమారులకు ఈ పేరు పెట్టుటకు కోరుకొనరు, అట్లయినప్పటికిని ఈ పేరు అర్థము

“స్తుతి” మరియు హెబ్రీ భాషలో “యూదా” అను నామము వంటిదే (ఆదికాండము 29:35). అలాగైతే యూదా యేసు యెడల ఎందుకు విశ్వాసవిద్రోహి అయ్యాడు? అతడు తన యజమానుని మార్గ దిశనే నాశనము నుండి మార్చుటకు ప్రయత్నించిన దయనీయమైనవాడును, తికమకపడినవాడునైన మనిషైయుండెనా? లేక అతని అధీనములో నుండి చేజారిపోయిన పరిస్థితులకు, దేవుని కటాక్షము యొక్క నిష్క్రియా సాధనమునకు లోనయ్యాడా?

యేసు జీవహారము గూర్చి ఉపదేశించిన తరువాత (యోహాను 6:48-58), “ప్రభువా, ... నీవే నిత్యజీవపు మాటలుగలవాడవని” పేతురన్నాడు (యోహాను 6:68). అందుకు యేసు, “నేను మిమ్మును, పండ్రెండుగురిని, ఏర్పరచుకొనలేదా? మీలో ఒకడు సాతానని” వారితో చెప్పాడు (యోహాను 6:70). ఆయన “సీమోను ఇస్కరియోతు కుమారుడైన యూదా పండ్రెండు మందిలో ఒకడైయుండి ఆయన నప్పగింపబోవుచుండెను గనుక వాని గూర్చియే ఆయన ఈ మాట చెప్పెనని” యోహాను వివరించాడు (యోహాను 6:71). యేసు “దేవుని పరిశుద్ధుడను” తన ఒప్పింపుతో శిష్యులందరు ఏకీభవించుచున్నారని పేతురు ఖచ్చితంగా ఎరిగినవాడై యుండినట్లు అగుపించుచున్నది (యోహాను 6:69). యేసే క్రీస్తని ఇస్కరియోతు యూదా విశ్వసించి యుండినట్లయితే, అతడు తన సొంత ప్రభువును మరణమునకు ఎలా అప్పగిస్తాడు?

యూదా గూర్చి మనకు సమాధానములు దొరకని అనేక ప్రశ్నలుండవచ్చును, కానీ అతని జీవితము గూర్చిన అనేక విషయాలు లేఖనములలో బయలుపర్చబడి యున్నవి.

మొదటిది, యేసు అప్పగింపబడునని ప్రవక్తల ద్వారా ప్రవచింపబడినప్పటికిని, దేవుని విమోచన ప్రణాళికలో యూదా ఇష్టపడని పాచిక కాదని మనమెరుగుము (కీర్తనలు 41:9; 55:12-14; అపొస్తలుల కార్యములు 1:25).

రెండవదిగా, అతడు యేసు చేత ఏర్పరచుకొనబడినప్పుడు, యూదా ఒక దుష్టుడు కాడు; కానీ అతడు అటుతరువాత దుష్టునితో సహకరించుటకు ఇష్టపడుచుండిన ప్రతినిధి అయ్యాడు. అతడు శోధనకు చోటిచ్చి దాని వశమయ్యాడు, గనుక సాతాను అతని జీవితముపై పెత్తనం చెలాయించాడు (యోహాను 13:27 చూడు).

మూడవదిగా, అద్భుతములు చేయగల శక్తిని యేసు నుండి ఇతర శిష్యుల వలెనే, అతడు కూడా పొందాడు మరియు బహుశా ఆ శక్తిని ఉపయోగించి యుంటాడు కూడ (లూకా 9:1, 10). యేసు అద్భుతములు చేసినప్పుడు ఇతర శిష్యుల వలెనే అతడు కూడ ఉన్నాడు, కాబట్టి యేసు యొక్క నిజమైన గుర్తింపు గూర్చి యూదా వంచింపబడలేదు. అతడు యేసు శత్రువులకు ఆయనను అమ్మివేసినప్పుడు, యేసు ఎవరై యుండెనో యూదా ఎరిగియుండెను.

నాలుగవదిగా, పేరాస యూదాకు ఒక పెద్ద సమస్యయై యుండినది. ఇతర పాపములన్నిటి వలెనే, ఈ పాపము కూడ అతని హృదయములో ఆరంభమయ్యింది (15:19). గనుక అతడు పరలోకములో ధనము కూర్చుకొనుట కంటే అధికంగా ఈ లోకములో ధనమును కూర్చుకొనుట గూర్చియే ఆందోళన చెందుచుండెను. అత్యాశ మూలముననే అతడు మరియ మనస్సును తన మాటలతో గాయపర్చాడు (యోహాను 12:4-6). ఈ సంఘటన సంభవించిన తరువాతి కొన్ని క్షణాల్లోనే, అతడు ప్రభువును

అప్పగించుటకు వెలుపలకు వెళ్లిపోయాడు (26:14, 15).

యూదా తన విద్రోహ చర్య గూర్చి దృఢనిశ్చయం చేసికొన్నాడు. కాబట్టి గెత్సేమనె తోటలోనికి తనతో కూడ బహు జనసమూహమును తన వెంటబెట్టుకొని వచ్చాడు, యేసు అప్పటికి ఆ తోటలోనే ఉండెను (26:47).

## యూదా ఎక్కడ తప్పు చేసాడు (26:14–16, 20–25, 47–50)

యూదా తన జీవితంలో అనేక తప్పులు చేసాడు, మనము వాటిని చేయకుందుముగాక:

1. అతడు డబ్బు గూర్చిన అంతులేని తన ఆసక్తిని జయించలేదు.
2. అతడు యేసు క్రీస్తు చేసిన హెచ్చరికలు విన్నాడు కానీ పెడచెవినిపెట్టాడు.
3. అతడు అతనికి అందుబాటులో నుండిన సువర్ణావకాశములను సానుకూలం చేసికొనలేదు.
4. అతడు తన చుట్టూర జరుగుచుండిన విషయాల పరిమాణములను అవగాహన చేసికొనలేదు.
5. అతడు ఆశాభంగములు మరియు అనుమానములకే తన జీవితాన్ని తమ స్వాధీనం కావించాడు.
6. అతడు తన విషయంలోనైతేనేమి ఇతరుల విషయంలోనైతేనేమి నిరాశపడ్డాడు.

---

సూచనలు

[1]యేసు అత్తరుతో అభిషేకింపబడుట (26:6–13) 26వ అధ్యాయంలో పేర్కొనబడిన ఇతర సంఘటనలకు కొద్ది దినముల క్రిందట జరిగినది. బహుశా యేసును అత్తరుతో అభిషేకించిన స్త్రీ యొక్క ఉదార భక్తికిని యూదా, యేసు ఏర్పరచుకొనిన పన్నెండు మంది శిష్యులలో ఒకడైనవాని (26:14–16) యొక్క విద్రోహ చర్యకును గల తారతమ్యమును మనకు చూపించుటకు మత్తయి ఈ ఉదంతమును ఇచ్చట ఉంచియుండును. [2]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 749. [3]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 150. [4]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 644. [5]Talmud *Yoma* 18a; *Yebamoth* 61a. [6]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 141. [7]Josephus *Antiquities* 18.2.1. [8]Ibid., 20.9.1. [9]Ibid., 18.2.2; 18.4.3. [10]Ibid., 18.2.2.

[11]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary,* vol. 1*, Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 160. ఆయన చేయుచుండిన చర్చతోపాటుగా, విల్కిన్స్ కయప అస్థికుంభము పటమును కూడ చేర్చాడు. [12]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 293; Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 238 చూడు. [13]ఆ కుటుంబమంతా ఒకే ఇంటిలో నివాసము చేయుచుండవచ్చును. లూకా వ్రాసిన సువార్తలో, మార్త తన ఇంటిలో యేసుకు భోజనము సిద్ధము చేయుచుండిన వివరము వ్రాయబడి యున్నది (లూకా 10:38, 40). ఈ సందర్భములో, మార్త సీమోను ఇంటిలో భోజనము సిద్ధము చేయుచుండెనని యోహాను వ్రాసిన సువార్త మనకు సూచించుచున్నది (యోహాను 12:2). [14]Wilkins, 161. [15]Lewis, 142. [16]ఒకడు తన ఆస్తిని అమ్మి బీదలకిచ్చుట ఉచితమని యేసు

ధనవంతుడైన యౌవన అధికారికిచ్చిన ఆదేశముల ప్రతిధ్వనియై యున్నది (19:21). [17]Joel B. Green and Holly E. Hearon, "Anointing," in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 12. [18]బహుశా తన సహోదరుడైన లాజరును మృతులలో నుండి లేపుట మూలమున అధికమగుచుండిన ఉద్రిక్తతను కూడ ఆమె అర్థంచేసికొని యుండును (యోహాను 12:9–11). [19]Hare, 294. [20]ఈ అభిప్రాయము NASB బైబిల్ అనువాదము చేత తెలియజెప్పబడుచున్నది. ఏది ఏమైనా, ఇతర బైబిల్ అనువాదములు వాటి లక్షణములో ఎక్కువగా సామాన్యమైనవై యున్నవి. ఉదాహరణ యూదా గూర్చి, "ఆయనను అటుతరువాత అప్పగింపనై యుండినవాడు" అని NIV వర్ణించుచున్నది (యోహాను 12:4).

[21]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 363. [22]Hare, 294. [23]Joyce G. Baldwin, *Haggai, Zechariah, Malach: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: InterVarsity Press, 1972), 184.